క్లుప్తంగా

పాడి పరిశ్రమతో లబ్ధి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కంది తిరుపతిరెడ్డి

చిగురుమామిడి: రైతులు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమతో లబ్ధిపొందాలని హుస్నాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సుందరగిరి, నవాబుపేట్ గ్రామాల్లో కోరుట్ల పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ కళాశాల, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం కింద ఉచిత మెగా పశు వైద్యశిబిరం నిర్వహించారు. మేలు రకం పాడి పశువులతో అధిక పాల దిగుబడి వస్తుందని, పశువుల్లో వచ్చే రోగాలకు ఎప్పటికప్పుడు చికిత్స చేయించాలని లేదంటే పాల దిగుబడి తగ్గడంతో పాటు ఒక్కోసారి మృత్యువాత పడే ప్రమాదం ఉందన్నారు. ప్రతి పశువుకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. కార్యక్రమంలో చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి వేణుగోపాల్‌రావు, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పశువైద్యులు సాంబారావు, పీవీ నర్సింహారావు, పశువైద్యకళాశాల డీన్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సహకారం, అంబికా, చిగురుమామిడి పశువైద్యాధికారి విజయ్‌భార్గవ్, శ్రీధర్, బొమ్మనపల్లి, రేకొండ, చిగురుమామిడి వెటర్నరీ అసిస్టెంట్లు సత్యం, సందీప్, శ్రీనివాస్ అధ్యాపకులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ఆదరించాలి



స్వాగతం పలుకుతున్న నాయకులు

జమ్మికుంట: బలహీన వర్గాలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని పట్టభద్రులు ఆదరించాలని మధనం గంగాధర్ (వాలంటరీ రిటైర్డ్ డీఎస్పీ) కోరారు. ఆదివారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, బలహీన వర్గాల అభివృద్ధి, విద్యావంతులకు తోడ్పాటు అందిస్తానన్నారు. బేడ బుడిగ జంగం, జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తూర్పాటి లింగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిరిగిరి సంపత్‌కుమార్ పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో జాన్, రేవెల్లి వెంకటేష్, చింతల అంజి, తూర్పాటి రాజు, చిన్న, భూతం అంజి, మోటం రామ్‌కుమార్, వాకర్స్, విద్యావంతులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మానకొండూర్: మండల కేంద్రంలోని చాణక్య హైస్కూల్ విద్యార్థులు డిసెంబర్ 1 అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని మానకొండూర్ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. స్కూల్ కరస్పాండెంట్ రవీందర్ మాట్లాడుతూ.. ఎయిడ్స్‌పై అవగాహన ఉంటేనే నిర్మూలన సాధ్యమన్నారు.

డిక్షనరీలు పంపిణీ

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదివారం కరీంనగర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా డిక్షనరీలు అందజేశారు. క్లబ్ జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. పాఠశాలలోని ఇంగ్లిష్ టీచర్ దామోదర్‌రెడ్డి విద్యార్థుల చదువు కోసం సహకారం అందించాలని కోరడంతో నిఘంటువులు అందించామని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో విద్యార్థుల కోసం పాఠశాలలో సౌకర్యాలు కల్పిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. సింగమ రాజు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మాలల ఒత్తిడితోనే వర్గీకరణజాప్యం



మాట్లాడుతున్న అనిల్, నాయకులు

జమ్మికుంట: మాలల ఒత్తిడితోనే సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ జాప్యం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ ఆరోపించారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మరో పోరాటానికి మాదిగలు సిద్ధం కావాలన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటస్వామి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రామచందర్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకుల్లు సాగర్, ఆదిత్య, రాజు, స్వర్ణకుమార్, సమ్మన్న, అనిల్, గణపతి పాల్గొన్నారు.



వెన్కెపల్లి సహకార సంఘం నూతన కార్యాలయం, నిర్మాణంలో ఫంక్షన్ హాల్



రాములపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు

‘సహకారానికి’ కొనుగోళ్లు ఊతం

- కొనుగోలు కేంద్రాలతో ఆర్థికంగా ఎదుగుతున్న సహకార సంఘాలు
- వెన్నెంపల్లి, వెన్కెపల్లి-సైదాపూర్ పీఏసీఎస్‌లకు రూ.6.50 కోట్ల ఆదాయం
- వ్యవసాయయ అనుబంధ, ఇతర వ్యాపార రంగాల్లో దూసుకెళ్తున్న సంఘాలు




వెన్నెంపల్లి సహకార సంఘం భవనం

సైదాపూర్: మండలంలో వెన్నెంపల్లి, వెన్కెపల్లి-సైదాపూర్‌లో వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో వెన్నెంపల్లి, లస్మన్నపల్లి, ఆరెపల్లి, సోమారం, ఎగ్లాస్‌పూర్ ఈ ఐదు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వెన్కెపల్లి-సైదాపూర్ సహకార సంఘం పరిధిలో 21 గ్రామ పంచాయతీలున్నాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 4, మిగిలిన 17 గ్రామాల్లో సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఈ వానాకాలం రెండు సంఘాల ఆధ్వర్యంలో రెండు లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయా సంఘాల అధికారులు తెలిపారు. సంఘాలు వ్యవసాయ అనుబంధ వ్యాపార రంగాల్లో దూసుకెళ్తున్నాయి. వచ్చే ఆదాయంతో సొంత కార్యాలయ భవనాలు, ఆస్తులు ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ వానాకాలం సీజన్‌లో సీడ్ కంపెనీల వరి సాగు మండలంలో బాగానే విస్తరించింది. సీడ్ వడ్లు, సన్న రకం రూ.ఐదువందల బోనస్‌తో కంపెనీలే కొనుగోలు చేస్తున్నాయి. ఒకప్పుడు పాలకుల అవినీతి, రైతుల రుణాల ఎగవేతలతో నిండా మునిగిన వ్యవసాయ సహకార సంఘాలు క్రమేణా వృద్ధిలోకి వచ్చాయి. ధాన్యం కొనుగోళ్లు, ఎరువులు, విత్తనాల విక్రయాలు, ఇతర వ్యాపారాలతో సంఘాలు రూ.కోట్లలో సొంత ఆస్తులను సంపాదించుకుంటున్నాయి. 2016 నుంచి 2024 యాసంగి సీజన్ వరకు వెన్కెపల్లి సహకార సంఘం రూ.4.50 కోట్లు, వెన్నెంపల్లి సహకార సంఘం రూ. 2 కోట్ల ఆదాయం కమీషన్ రూపంలో పొందాయి.

సొంత ఆస్తుల నిర్మాణం

వెన్నెంపల్లి సహకార సంఘం ఇప్పటికే వెన్నెంపల్లిలో గోదాం, పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదుగుతోంది. ఇటీవల ఎగ్లాస్‌పూర్‌లో గోదాం, వెన్నెంపల్లిలో కార్యాలయ సొంత భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. వెన్కెపల్లి-సైదాపూర్ విశాల సహకార సంఘం కార్యాలయం శిథిలావస్థలో ఉంటే రూ. కోట్లతో నూతన కార్యాలయం నిర్మించగా ఫంక్షన్ హాల్ నిర్మాణం పూర్తి కావస్తోంది. సంఘం పరిధిలోని గ్రామాల్లో గోదాంలు, పెట్రోల్ బంక్‌ల నిర్మాణానికి పాలకవర్గం కార్యాచరణ చేపడుతోంది. కరువుతో రుణాలు చెల్లించక రైతులు, పాలకవర్గాల దోపిడీతో కోలుకోలేని స్థితిలో ఉన్న వ్యవసాయ సహకార సంఘాలు 2016 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణతో పాటు ఎరువుల విక్రయంతో ఆర్థికంగా నిలదొక్కుకొని సొంత ఆస్తులు, కార్యాలయాలు నిర్మించుకోవడమే కాకుండా వ్యవసాయ అనుబంధ వ్యాపార కార్యక్రమాలను విస్తరిస్తున్నాయి.

తప్పిన దళారుల బెడద



కొనుగోలు కేంద్రాలతో సంఘాలు ఆర్థికంగా ఎదుగుతున్నాయి. మూతపడే పరిస్థితి నుంచి సొంత ఆస్తుల స్థాయికి చేరుకున్నాయి. రైతులకు దళారుల బెడద తప్పించడంతోపాటు ప్రభుత్వం వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలు నిర్వహించడం, రైతు సంక్షేమ పథకాల అమలు జరుగుతోంది. సకాలంలో రుణాలు ఇవ్వడంతో పాటు రైతుకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు, అందుబాటులో ఉంచుతున్నాయి. సహకార సంఘాల నూతన భవనాలతో పాటు ధాన్యం నిల్వలకు గోదాం, పెట్రోల్ బంక్‌లు నిర్మించాం. ఇతర వ్యాపార రంగాలపై సహకార సంఘాలు దృష్టి సారించి ఆర్థికంగా ఎదుగుతున్నాయి.

– బిల్లా వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, వెన్నెంపల్లి



శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయాలు నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో వచ్చిన నిధులు వెనక్కి వెళ్లాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఎంతో ప్రాముఖ్యత ఉన్న గ్రామం నూతన భవన నిర్మాణానికి నోచుకోవడంలేదని, ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మల్లేశం, పంచాయతీరాజ్ ఏఈ, సెల్ నం : 8309744022

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

పనులు ప్రారంభించాలి

రామడుగు: మండలంలోని షానగర్ నుంచి మోతె, కోరటపల్లి గ్రామాల మీదుగా వెళ్లే రహదారికి ప్రభుత్వం రూ.2.14 కోట్లు మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభించడంలేదని దీంతో నిత్యం ప్రయాణికులు చాలా ఇబ్బందిపడుతున్నారని అధికారులు తక్షణం పనులు ప్రారంభించకపోతే ఆర్ అండ్‌బీ ఎస్ఈ కార్యాలయం ముట్టడిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్ యాదవ్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభించకపోతే ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ మోడీ రవీందర్, బీజేపీ మండల అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి పోచంపల్లి నరేశ్, పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు కుమార్, రామ్, లక్ష్మణ్, జయంత్, శ్రీనివాస్, రమేశ్ పలువురు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

సైదాపూర్: తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలో ముదిరాజ్ సైదాపూర్ మండల మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించారు. కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అమరుల త్యాగాలతో తెలంగాణ ఏర్పడిందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కిష్టయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని మోసం చేసిందని నాయకులు ఆరోపించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు రాయిశెట్టి చంద్రయ్య, మండల అధ్యక్షుడు రేగుల అశోక్, ప్రధాన కార్యదర్శి గూళ్ల అశోక్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు వస్తాదుల సదానందం, పవన్, అజయ్, రాములు, సంపత్, సారయ్య, వెంకట్రాజం, సమ్మయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న గౌడ యువజన సభ్యులు

చొప్పదండి: మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు పెరుమాండ్ల రవి ఇటీవల మృతిచెందాడు. పట్టణంలోని గౌడ యువజన సంఘం సభ్యులు రూ.ఐదువేలు, మరో ఇద్దరు సభ్యులు రెండు రైస్ బ్యాగులు అందించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల గంగయ్యగౌడ్, యువజన సంఘం అధ్యక్షుడు బూరుగు నరేశ్‌గౌడ్, బూరుగు శ్రీనివాస్, పొడాల శ్రీనివాస్, పొడాల సతీశ్, శ్రీనాథ్, పొడాల శ్రీనివాస్, కట్ల రాజు, గుర్రం సాయి, పూదరి మధు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



దుర్గరాజు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక శిక్షణ పాఠశాల విద్యార్థి పి. దుర్గరాజు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే జాతీయ స్థాయి అండర్–14 హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. శనివారం హుజూరాబాద్‌లో జరిగిన స్టేట్ లెవల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడని స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీరావు, ప్రిన్సిపాల్ జి. కాళహస్తీ, శ్రీనివాస్, ప్రమోద్‌రాజు, ఇనాక్, బాలసుందర్ రావు, విక్రమ్, తదితరులు అభినందించారు.

విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

చొప్పదండి: పెద్దపల్లి జిల్లాలో 4న జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండలం నుంచి జన సమీకరణ చేసి బహిరంగ సభకు తరలించే వరకు ప్రతి కార్యకర్త శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ఏఎంసీ వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, కౌన్సిలర్ కొట్టె అశోక్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, మునిగాల సుధాకర్ గౌడ్, గుర్రం రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

గంగాధర: అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన బైరి శ్రీనివాస్(40) అప్పుల బాధతో నవంబర్ 26న వ్యవసాయబావి వద్ద గడ్డిమందు తాగాడు. ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. భార్యతో పాటు మరో వ్యక్తికి మందు తాగినట్లు ఫోన్‌లో తెలిపాడు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని, శ్రీనివాస్ భార్య గౌతమి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని, మృతుడికి కూతురు ఉందని వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మానకొండూర్: మండలంలోని లింగాపూర్‌శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

నియామకం

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం కొలువుదీరి ఏడాది కావస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజా విజయోత్సవాల విజయవంతానికి అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్తలను నియమించింది. బాల్కొండ నియోజకవర్గానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ముథోల్ నియోజకవర్గానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశ్, బాన్సువాడకు పీసీసీ అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌రావులను జిల్లా నుంచి సమన్వయ కర్తలుగా నియమించారు.

హామీలు అమలు చేయాలి

జమ్మికుంట: రైతు పండుగ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతుకు రైతు భరోసా ఎకరాకు రూ.12వేలు ఇస్తానన్న హామీని విస్మరించిందని తెలంగాణ పత్తి రైతుల సంఘం రాష్ట్ర కోకన్వీనర్ చెల్పూరి రాము ఆరోపించారు. ఆదివారం పట్టణంలో విలేకర్లతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా రైతు పండుగ చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కౌలు రైతులకు తక్షణం న్యాయం చేయాలని తెలంగాణ పత్తి రైతుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు.

సంఘాలు- నియామకాలు

రెడ్డి సంఘం కార్యవర్గం



రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. పీచు రామ్‌కృష్టారెడ్డి, కర్ర శ్యాంసుందర్‌రెడ్డి, ఒద్దుల హన్మంతరెడ్డి పోటీలో పాల్గొన్నారు. రామ్ కృష్టారెడ్డి గెలుపొందగా సంఘం అధ్యక్షుడిగా నియమించామని నిర్వాహకులు కర్ర వెంకట్రామిరెడ్డి, ఎడవెల్లి పాపిరెడ్డి, రమణారెడ్డి ప్రకటించారు. కర్ర విద్యాసాగర్‌రెడ్డి ప్రధానకార్యదర్శి, చాడ గంగారెడ్డి సహాయ కార్యదర్శి, చాడ దామోదర్‌రెడ్డి కోశాధికారి, దాసరి నారాయణరెడ్డి, ఎడవెల్లి రాజిరెడ్డి, చాడ హన్మంత రెడ్డి, ఎడవెల్లి మహిపాల్‌రెడ్డి, మిర్యాల సత్యనారాయణరెడ్డి సంఘం సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన సంఘం కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

సీపీఎం జిల్లా కమిటీ సభ్యులుగా..



శీలం అశోక్



రాజిరెడ్డి


జమ్మికుంట: కరీంనగర్ జిల్లా కేంద్రంలో సీపీఎం జిల్లా పదో మహాసభలు నిర్వహణలో భాగంగా నూతన జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడిగా పట్టణానికి చెందిన శీలం అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై అనునిత్యం పోరాడుతామన్నారు. పీడిత వర్గాల కోసం ఉద్యమాలు, పోరాటాలు చేయడంతోపాటు సంక్షేమం అందించేందుకు కృషి చేస్తామన్నారు. నియమకానికి పార్టీ ప్రతినిధులు, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్, కొప్పుల శంకర్‌కు పార్టీ పట్టణ కార్యదర్శి దండిగారి సతీశ్ ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు.

శంకరపట్నం: సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా శంకరపట్నం మండల కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డిని నియమించారు. మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన రాజిరెడ్డి వరుసగా మూడోసారి మండల కార్యదర్శి, నాలుగోసారి జిల్లా కమిటీ సభ్యుడిగా ఎంపిక చేశారు. ప్రజాఉద్యమాలపై నిరంతరం పోరాటం చేస్తానని రాజిరెడ్డిన్నారు.

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి..

మానకొండూర్: గన్నేరువరంలో మాదిగ, మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడిగా రామంచ సంపత్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బండపల్లి శంకర్, ఉపాధ్యక్షుడిగా చిలుముల లక్ష్మయ్య ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామంచ సంపత్ మాట్లాడారు. ఏబీసీడీ వర్గీకరణకు మద్దతుగా పోరాటం చేస్తామని, కొంతమంది వ్యతిరేకిస్తున్నారని వర్గీకరణ అమలయ్యే వరకూ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో ఈదయ్య, కవ్వంపల్లి రాజయ్య, మాతంగి అనిల్, మునీందర్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్, ప్లంబర్స్ కార్యవర్గం



చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్ గ్రామంలో పనిచేస్తున్న పెయింటర్స్, ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోయిని విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా బోయిని ఉమేశ్, జెట్టి సాగర్, ప్రధాన కార్యదర్శిగా బోయిని చిన్న రాజు, కోశాధికారిగా రామ్‌లక్ష్మణ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రాజు, మనోజ్, బాబు, బండారి బాబు, హన్మంతు, బొల్లి శ్రీకాంత్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

భీమ్ ఆర్మీ చిగురుమామిడి కార్యవర్గం

చిగురుమామిడి: భీమ్ ఆర్మీ చిగురుమామిడి కార్యవర్గాన్ని ఆదివారం మండలంలోని సుందరగిరి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వంతడ్పుల హరీశ్, ఉపాధ్యక్షుడిగా సాంబారి సురేశ్, కార్యదర్శిగా తాటిపెల్లి చంద్రశేఖర్, మరో పదిమందిని కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ఎల్కతుర్తి గణేశ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలని గణేశ్ కోరారు. దళిత బహుజనులపై రోజురోజుకు దాడులు ఎక్కువైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భీమ్ ఆర్మీ నాయకులు శ్యామ్, గిరిధర్, కృష్ణ, వరుణ్, బాబు, అరుణ్‌కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

దేవస్థానం కమిటీ

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన కమిటీని సభ్యులు ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి కనకయ్య, ఉపాధ్యక్షులు సీపెల్లి వెంకటేష్, దాసరి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా చంద్రయ్య, గౌరవాధ్యక్షుడిగా, అంజయ్య, కోశాధికారిగా కిరణ్, సలహాదారులుగా శ్రీనివాస్, రాజయ్య, నరసయ్య, అంజయ్య, సంయుక్త కార్యదర్శి శంకరయ్య, రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, రాజు, వెంకటేష్, రవి, మనోజ్, మోహిత్, అనిల్, అరవింద్‌ను సభ్యులు ఎన్నుకున్నారు.

టగ్ ఆఫ్ వార్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా..

శంకరపట్నం: తెలంగాణ టగ్‌ఆఫ్‌వార్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన కొరిమి సంతోశ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న సంతోశ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. 20 ఏళ్లుగా రాష్ట్ర, జాతీయస్థాయికి క్రీడాకారులను తయారు చేసినందుకు రాష్ట్ర సంఘం ఏకగ్రీవంగా ఎన్నుకుంది, ఎంపిక పట్ల జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీపాల్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడాసంఘం అధికారి శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ బాధ్యులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎండీ.కరీం, తుమ్మల రమేశ్‌రెడ్డి, సీద్దారెడ్డి, సీనియర్ క్రీడాకారులు జనగాం శ్రీనివాస్, బుద్దార్థి సంపత్, పూదరి మొగిళి హర్షం వ్యక్తం చేశారు.

ఇష్టపడి చదివితే లక్ష్యం సాధ్యం



ప్రవీణను సన్మానిస్తున్న భాస్కర్, తదితరులు

మానకొండూర్: ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. మండలంలోని గుండ్లపల్లికి చెందిన కురుమెల్లి శేఖర్ భార్య ప్రవీణ ఎస్జీటీ ఉద్యోగం సాధించి సిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలో విధులు నిర్వహిస్తోంది. భాస్కర్, గన్నేరువరం రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బేతేల్లి రాజేందర్‌రెడ్డి ఆదివారం ప్రవీణను శాలువాతో ఘనంగా సన్మానించారు. గృహిణులు ప్రవీణను ఆదర్శంగా తీసుకొని లక్ష్యసాధనకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బేతేల్లి రాజేందర్ రెడ్డి టీడీపీ మండల అధ్యక్షుడు గుండ పర్శరామ్ గౌడ్, గునుకుల కొండాపూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, కురుమేల్లి శేఖర్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

హుజూరాబాద్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మాలల సింహగర్జన సభకు హుజూరాబాద్ నుంచి మాల మహానాడు సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేయాలన్నారు.

శంకరపట్నం: మండలం నుంచి మాలలు భారీగా తరలి వెళ్లారు. కేంద్ర నిర్ణయాన్ని తప్పుబట్టారు.

మానకొండూర్: మండలం నుంచి మాల సంఘం నాయకులు తరలి వెళ్లారు. వెనుకబాటుకు గురైన మాలలు, ఉపకులాల విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీసేలా ఉన్న వర్గీకరణ సరికాదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

సైదాపూర్: సింహగర్జనకు సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో మాలలు తరలివెళ్లారు.

జమ్మికుంట: పట్టణం నుంచి మాల సంఘం నాయకులు భారీగా తరలివెళ్లారు. మందకృష్ణ మాదిగను పావుగా వాడుకొని దళితుల మధ్య చిచ్చు పెట్టేందుకు అగ్రవర్ణాలు కుట్రలు పన్నుతునాన్నయని మాలలు పేర్కొన్నారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

కరీంనగర్: విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశ సేవ చేయాలని జమియతుల్ ఉలేమా జిల్లా అధ్యక్షుడు ముఫ్తి ఏతేమాదుల్ హఖ్ అన్నారు. ఆదివారం ముకరంపుర నవాబ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్‌ఫెయిర్ వేదికలన్నారు.



అ‘పూర్వ’ సమ్మేళనం

హుజూరాబాద్: పట్టణంలోని ఉషోదయ ఉన్నత పాఠశాల 1999–2000 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చాలా ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మండల వీరస్వామి, ఉపాధ్యాయులు ఉన్నారు.